www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మెదక్ | సంపుటి : 17 | సంచిక : 295 | పేజీలు : 3 | వెల : 1
Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శుక్రవారం 05-07-2024

MHR TV
www. mhrtv.com


ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- విభజన హామీలు నెరవేర్చేందుకు చొరవ తీసుకోవాలి
- వివిధ శాఖల్లో పెండింగ్ అంశాలను పరిష్కరించాలి
- కాజీపేట రైల్వేకోచ్ నిర్మాణానికి సాయం చేయండి
- బొగ్గు గనులను వేలం లేకుండా సింగరేణికి కేటాయించాలి
- ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సమావేశం

**న్యూఢిల్లీ జూలై 4 :** రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రులను కలిశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోఢీతో సిఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు చెప్పారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉంటాయన్నారు.రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగించాలనే ఆలోచనతోనే ప్రధాని, కేంద్రమంత్రులను కలిశామన్నారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు. ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. విభజన హామీల పరిష్కరించేలా కేంద్ర హోంశాఖ చొరవ తీసుకోవాలని కోరినట్లు సీఎం రేవంత్ తెలిపారు.అనంతరం మాట్లాడిన డిప్యూటీ సిఎం భట్టి.. తెలంగాణకు ఐఐఎం ఇవ్వాలని, ఐటీఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని ప్రధాని మోదీని కోరామన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి **మిగతా 2 లో..**

# గ్రాండ్ వెల్‌కమ్

## స్వదేశానికి చేరుకున్న టీమ్ ఇండియా

- ఢిల్లీ ఎయిర్ పోర్టులో అభిమానులు ఘనస్వాగతం
- హోరెత్తిన భారత్ మాతా కీ జై నినాదాలు
- వరల్డ్ కప్ చూపిస్తూ రోహిత్ శర్మ అభివాదం
- అభినందనలు తెలిపిన ప్రధాని నరేంద్రమోదీ
- దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు




**న్యూఢిల్లీ, జూలై 4, :** చాంపియన్స్ వచ్చేశారు.. టీ–20 వరల్డ్ కప్ తో ఢిల్లీలో అడుగుపెట్టిన టీమిండియాకి ఘనస్వాగతం లభించింది.. 20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన టీమ్‌ఇండియా ఐదు రోజుల తర్వాత స్వదేశానికి చేరుకుంది. ఈనెల 29న జరిగిన ఫైనల్ పోరులో సౌతాఫ్రికాపై అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. కప్ గెలిచిన తర్వాతే అక్కడి నుంచి బయలుదేరాల్సి ఉన్నా బెరిల్ తుఫాను కారణంగా బార్బడోస్ లోనే ఉండిపోయిన భారత జట్టు గురువారం ప్రత్యేక విమానంలో ఇండియా చేరుకుంది. ఉదయం ఢిల్లీ ఎయిర్ పోర్టులో వరల్డ్ చాంపియన్లకు బీసీసీఐ **మిగతా 2 లో..**


ముంబయి చేరుకున్న 'టీమ్ ఇండియా' కు స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు


ఝార్ఖండ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న హేమంత్ సోరెన్

## మళ్లీ.. సీఎంగా హేమంత్ సోరెన్

- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ రాధాకృష్ణన్
- మనీలాండరింగ్ కేసులో జనవరి నుంచి జైలులోనే..
- కొద్ది రోజుల క్రితం బెయిల్ మంజూరు చేసిన ఝార్ఖండ్ హై కోర్టు

2



- ద్వితీయ శ్రేణి నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- పార్టీ మారిన వారి వెంట వెళ్లొద్దంటూ బుజ్జగింపులు
- కష్టకాలంలో వెంటే భవిష్యత్తులో ప్రాధాన్య ముంటుందని వెల్లడి
- క్షేత్రస్థాయిలో క్యాడర్ చేజారకుండా జాగ్రత్త
- మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమాతో ముందుకెళ్దామని సూచన
- స్థానిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వ్యూహం మార్చిన కేసీఆర్
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్ లో వరుస సమావేశాలు

2

## మీదే భవిష్యత్తు..
## నాది భరోసా






## కేకే రాజీనామా

- రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు రిజైన్ లెటర్ అందజేత
- బుధవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కేశవరావు

2

## అద్వానీకి మళ్లీ అస్వస్థత



- న్యూఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరిక
- అబ్జర్వేషన్ లో ఉన్నట్టు వైద్యుల వెల్లడి
- వారం క్రితం ఎయిమ్స్ లో చికిత్స


2

## బదిలీలకు గ్రీన్ సిగ్నల్

### నేటి నుంచి 20 వరకు షెడ్యూల్

- సీఎం ఆదేశాలతో నిషేధం ఎత్తివేసిన ఆర్థిక శాఖ
- ఒకే చోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న వారికి స్థానచలనం
- వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఆప్షన్లు స్వీకరణ
- 21 నుంచి మళ్లీ నిషేధం అమలు

2



## ఏపీకి టెస్లా..?

- కసరత్తు మొదలుపెట్టిన సీఎం చంద్రబాబు
- డేటా సిద్ధం చేసిన పరిశ్రమల శాఖ
- కియా తరహాలో మరో భారీ ప్రాజెక్టు తెచ్చేందుకు ప్రణాళికలు
- 2017లోనే ఎలన్ మస్క్ తో సీఎం భేటీ
- మంత్రి లోకేశ్‌కు బాధ్యతలు

2

## రేపు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం

వ్యూహ, ప్రతివ్యూహాలతో అధికార, విపక్షాలు సిద్ధం

2

# ఏపీకి టెస్లా..?

**గుంటూరు, జూలై 4, (ప్రజాస్వరం):** ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడిదారులను రప్పించేందుకు ప్లాన్ చేస్తోంది చంద్రబాబు సర్కార్. దీనిపై పరిశ్రమల శాఖ అధికారులు ఓ డేటా రెడీ చేశారు. ఇందులోభాగంగా పలు కంపెనీలకు లేఖలు రాస్తు న్నారు. ఈ క్రమంలో టెస్లా కంపెనీపై కన్నేసింది ఏపీ ప్రభుత్వం. ఈ వ్యవహారంపై చర్చించేందుకు మంత్రి నారా లోకేష్ ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంగం లోకి దించినట్టు సమాచారం.హైదరాబాద్ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ నూ ప్రపంచప టంలో పెట్టాలని భావిస్తున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. కియా ద్వారా ఏపీకి కొంత గుర్తింపు వచ్చినప్పటికీ, ఆ తరహా కంపెనీ మరొకటి వస్తే బాగుంటుం దని ఆలోచన చేస్తున్నారు. భారీ పరిశ్రమ వస్తే అభివృద్ధి చెందడమేకాదు, ఎగు మతులను హబ్ గా మారుతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రానిక్ వాహనాల–ఈవీ తయారీ కంపెనీలకు లేఖలు రాస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అను వైన వాతావరణాన్ని వివరిస్తున్నారు.కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపు తున్న సంస్థల వివరాలను ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు సేకరించింది. సుమా రు 75 సంస్థల వివరాలను సిద్ధం చేసినట్టు అంతర్గత సమాచారం. ఆయా సంస్థల యాజమాన్యాలతో ఏపీ ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అమె రికా, యూరప్ తోపాటు అరబ్ దేశాల నుంచి భారీ పెట్టుబడులు వస్తాయని భావి స్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల–ఈవీ తయారీలో టెస్లా కార్ల కంపెనీ ఒకటి. ఇండియాలో ఆ కంపెనీ పెట్టేందుకు దృష్టి సారిస్తున్నట్లు సీఈఓ ఎలన్ మస్క్ వెల్లడించారు. ఈ ఏడాది చివరలో ఇండియా వచ్చి ప్రధాని నరేంద్రమోదీని కలుస్తానని తెలిపారు. ఆ కంపెనీ కోసం చాలా రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు, మహా రాష్ట్ర, తెలంగాణతోపాటు ఏపీ కూడా రేసులో ఉంది.2017లో దావోస్ కు వెళ్లినప్పుడు టెస్లా కంపెనీ సీఈఓ ఎలన్ మస్క్ తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పాత పరి చయాలతో ఆ కంపెనీని రప్పించేందుకు పావులు కదుపుతున్నారట. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్ ను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే ఆయన త్వరలో అమెరికా వెళ్లి ఎలన్ మస్క్ తో సమావేశమయ్యే అవకా శ ముందని తెలుస్తోంది. ఈ ఏడాది చివరలో మస్క్ ఇండియాకు వచ్చేలోపు కంపెనీని ఏపీకి రప్పించేందుకు ఆలోచన చేస్తున్నారు.

# బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**5వ తేదీ నుంచి 20 వరకు షెడ్యూల్**

**సీఎం ఆదేశాలతో నిషేధం ఎత్తివేసిన ఆర్థిక శాఖ**

**ఒకే చోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న వారికి స్థానచలనం**

**వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఆప్షన్లు స్వీకరణ**

**21 నుంచి మళ్లీ నిషేధం అమలు**

**హైదరాబాద్, జూలై 4, (ప్రజాస్వరం):** తెలంగాణ ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 5వ తేదీ నుంచి 20 వరకు బదిలీల షెడ్యూల్ ప్రకటించింది. 2024 జూన్ 30 నాటికి ఒకే చోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించింది. ఒకేచోట రెండేళ్లు పూర్తి కాని ఉద్యోగులను ట్రాన్స్ ఫర్ చేయొద్దని జీవోలో పేర్కొంది. కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగులను బదిలీ ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లు, వితంతువులు, భార్యభర్తలు(స్పౌజ్) లకు బది లీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి, ఆప్ష న్లను స్వీకరించి బదిలీలు చేయనున్నారు.ఈ నెల 5 నుంచి 8 వరకు ఉద్యోగ సంఘా లతో బదిలీలపై చర్చించి వివరాలను ప్రకటించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జులై 9 నుంచి 12వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరిం చనున్నట్లు ప్రకటించింది. జులై 13 నుంచి 18 వరకు ఉద్యోగుల బదిలీల అప్లికేషన్లు పరిశీలించనున్నారు. జులై 19, 20 తేదీల్లో ఉద్యోగుల బదిలీలపై ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అలాగే ఈ నెల 21 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుం దని ఆర్థికశాఖ ప్రకటించింది. ఒకరి కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఒకే చోటకు ట్రాన్స్ ఫర్ ఎంచుకుంటే అధికారులు ప్రాధాన్యత క్రమం మేరకు నిర్ణయం తీసుకుం టారని ఆర్థిక జీవోలో పేర్కొంది.

**ఈ కింద విధానంగా అధికారులు బదిలీలకు ప్రాధాన్యత ఇస్తారు.**

- భార్యాభర్తల బదిలీలు( ఇద్దరిలో ఒకరు మాత్రమే బదిలీ అవుతారు).
- జూన్ 30, 2025లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులు బదిలీలు పెట్టుకుంటే

వారికి అవకాశం కల్పిస్తారు.

- 70% లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన ఉద్యోగుల బదిలీ
- మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులు వైద్య సదుపాయాలు అందుబాటులో ప్రదేశాలకు బదిలీ అయ్యేందుకు వీలు కల్పిస్తారు.
- వితంతువులు.
- పలు వ్యాధులకు సంబంధించిన వైద్యపరమైన కారణాలు (స్వయంగా లేదా జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా తల్లిదండ్రులు) చికిత్స కోసం సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రదేశాలకు బదిలీ చేస్తారు.

కష్టతరమైన ప్రదేశాల్లో ఎక్కువగా కాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను గుర్తించి , వారి బదిలీలకు అవకాశం కల్పిస్తారు. వ్యక్తిగత లేదా వైద్య కారణాల బదిలీపై ఉన్నతాధికారులు వెరిఫై చేస్తారు. ఈ కారణాలను ప్రభుత్వానికి రిపోర్టు చేస్తారు.

# అద్వానీకి మళ్లీ అస్వస్థత

**న్యూఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరిక**

న్యూఢిల్లీ, జూలై 4, : బీజేపీ అగ్రనేత, దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం మరోసారి క్షీణించింది. ఆయన న్యూఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. మథుర రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో ఎమర్జెన్సీకి తరలించారు. అద్వానీ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, అబ్జర్వేషన్ లో ఉన్నారని అపోలో ఆసుపత్రి ఒక ప్రకటన రిలీజ్ చేసింది. రాత్రి 9 గంటల సమయంలో ఆయనను అపోలో ఆస్పత్రికి తరలించారు. అద్వానీ అస్వస్థతకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.96 ఏళ్ల భారతరత్న లాల్ కృష్ణ అద్వానీ పరిస్థితి విషమించడంతో వారం రోజుల క్రితం రాత్రి 10.30 గంటలకు ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో యూరాలజీ విభాగంలో చేరారు. అతని పరిస్థితి మెరుగుపడడంతో మరుసటి రోజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

అద్వానీకి ఈ ఏడాది మార్చి 30న భారతరత్న అవార్డు లభించింది. 2015లో దేశంలోని రెండవ అత్యున్నత పౌర పురస్కారం అంటే పద్మవిభూషణ్ తో సత్కరించారు. భారతరత్నతో సత్కరిస్తున్నట్లు ప్రకటన వచ్చిన వెంటనే అద్వానీ మాట్లాడుతూ.. తాను భారతరత్నను గౌరవంగా అంగీకరిస్తున్నాను. ఇది తనకు మాత్రమే దక్కిన గౌరవం కాదని.. మనం జీవితాంతం అనుసరించిన ఆలోచనలు, సూత్రాల పట్ల గౌరవం ఇది అని చెప్పారు.రాజకీయ నాయకుడిగానే కాదు శక్తివంతమైన వక్తలలో అద్వానీ కూడా ఒకరు. రామమందిర ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషించిన వారిలో అగ్రగణ్యుడు.

భారతీయ జనతా పార్టీకి పునాది వేసిన వారిలో అద్వానీ ఒకరు. అతను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తో కలిసి పని చేయడం ద్వారా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మూడు సార్లు బీజేపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. దీంతో పాటు దేశానికి ఉప ప్రధానిగా కూడా పనిచేశారు. అద్వానీ 1927 నవంబర్ 8న సింధ్ ప్రావిన్స్ (పాకిస్థాన్)లో జన్మించారు. కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ స్కూల్ లో చదివాడు.

1980 నుంచి 1990 మధ్య అద్వానీ బీజేపీని జాతీయ స్థాయిలో పార్టీగా మార్చడానికి కృషి చేశారు. 1984లో కేవలం 2 సీట్లు మాత్రమే గెలిచిన పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో 86 సీట్లు రావడంతో అద్వానీ చేసిన కృషికి తగిన ఫలితం కనిపించింది. ఆ సమయంలో ఇది చాలా మెరుగైన ప్రదర్శనగా చెప్పవచ్చు.

# గ్రాండ్ వెల్ కమ్



ప్రపంచ కప్ ను అభిమానులకు చూపిస్తున్న టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ

(మొదటి పేజీ తరువాయి)
అధికారులు, టీమ్ఇండియా ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జైషా, మీడియా కూడా అదే విమానంలో స్వదేశం చేరుకున్నారు. ప్లేయర్ల రాకతో ఢిల్లీ ఎయిర్ పోర్ట్ ఫ్యాన్స్తో కిక్కిరిసిపోయింది. భారీగా అభిమానులు అక్కడికి చేరుకుని.. టీమిండియా క్రికెటర్లకు స్వాగతం పలికారు.. 'భారత్ మాతా కీ జై'.. 'ఇండియా ఇండియా' నినాదాలతో ఫ్యాన్స్ హోరెత్తించారు. కెప్టెన్ రోహిత్ శర్మ వరల్డ్ కప్ ట్రోఫీని అభిమానులకు చూపిస్తూ అభివాదం చేశారు.. దాదాపు 17 ఏళ్ల తర్వాత టీ20 వరల్డ్ కప్ సాధించిన టీమిండియా జట్టుకు అభిమానులు ఘనస్వాగతం పలికారు.అనంతరం క్రికెటర్లు బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో ఐటీసీ మౌర్య హోటల్కు వెళ్లారు.

**క్రికెటర్స్ ను అభినందించిన ప్రధాని**

భారత క్రికెట్ జట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసింది. ఈ సందర్భంగా టీ20 వరల్డ్కప్ గెలిచిన భారత జట్టును ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. టీ20 వరల్డ్ కప్తో బార్బడోస్ నుంచి ఢిల్లీ చేరుకున్న టీమిండియాకు ఎయిర్పోర్ట్లో ఘనస్వాగతం లభించింది. అనంతరం ఐటీసీ మౌర్యా హోటల్ కు చేరుకున్న క్రికెటర్లు కాసేపు రెస్ట్ అనంతరం.. లోక్కల్యాణ్ మార్గ్లోని ప్రధాని నివాసానికి చేరుకున్నారు. తన ఇంటికి చేరుకున్న టీమిండియా ప్లేయర్స్ తో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. టీ20 వరల్డ్కప్ గెలిచిన భారత జట్టును మోదీ ప్రత్యేకంగా అభినందించారు. బ్రేక్ఫాస్ట్ విత్ ఛాంపియన్స్.. కార్యక్రమంలో భాగంగా మోదీ.. క్రికెటర్లతో ప్రత్యేకంగా సంభాషించారు.. టి20 వరల్డ్ కప్ లో భారత జట్టు ప్రదర్శన.. ఫైనల్ మ్యాచ్ తదితర అంశాలను స్వయంగా అడిగితెలుసుకున్నారు.

ఈ సందర్భంగా టీ 20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత ఎంత భావోద్వేగానికి గురయ్యామో... ఆటగాళ్లు మోదీకి వివరించారు. ప్రతీ ఆటగాడు తమ అనుభవాలను ఆయనతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మోదీ జట్టు సభ్యులతో కలిసి ఫొటో దిగారు.



ప్రధాన మంత్రి నరేంద్రమోదీని తన నివాసంలో కలిసిన వరల్డ్ కప్ తో ఫోటో దిగిన టీమ్ ఇండియా జట్టు



ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక వాహనాల్లో వస్తున్న టీమ్ ఇండియా జట్టు

# మీదే భవిష్యత్తు.. నాది భరోసా

**ద్వితీయ శ్రేణి నాయకులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం**

**ఎమ్మెల్యేలు పార్టీ మారినా వారి వెంట వెళ్లొద్దంటూ బుజ్జగింపులు**

**మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమాతో ముందకెళ్దామని సూచన**

**స్థానిక ఎన్నికలు సమీపిస్తుండడంతో కేసీఆర్ సరికొత్త వ్యూహం**

**ఎర్రవల్లి ఫామ్ హౌస్లో వరుస సమావేశాలు**



**హైదరాబాద్, జూలై 4, (ప్రజాస్వరం) :** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో బీఆర్ఎస్ కోటకు బీటలు వారుతున్నాయి. పవర్ కోల్పోవడంతో ఒక్కరొక్కరుగా గులాబీ ఎమ్మెల్యేలు పార్టీ మారుతు న్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, మరి కొంద రు కీలక నేతలు పార్టీ చేంజ్ అయ్యారు. బీఆర్ఎ స్ లో వలసల ప్రవాహం మొదలు కావడంతో అడ్డు కట్ట వేసేందుకు అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలను ఫామ్ హౌస్ కు వారితో వరుస భేటీలు నిర్వహిం చారు. పార్టీ మారొద్దని, భవిష్యత్ మనదేనని భరోసా కల్పించడంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తా మని హామీలు ఇస్తున్నారు. అయితే, కేసీఆర్ బుజ్జగిం చినప్పటికీ ఆయన ముందు సరేనని.. తర్వాత కొంద రు పార్టీ మారుతున్నారు. ఇటీవల పార్టీ మారిన ఎమ్మె ల్యేలు కొందరు ఇదే రీతిలో వ్యవహరిం చారు.దీంతో గులాబీ బాస్ స్ట్రాటజీ మార్చారు. ఎమ్మె ల్యేలు, ఇతర కీలక నేతలతో భేటీలు ముగియడంతో సెకండ్ కేడర్ ను ఎంకరేజ్ చేయాలని నిర్ణయిం చుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ వీడిన వారి వెంట సెకండ్ క్యాడర్ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు టాక్. ఎమ్మెల్యేలు పార్టీ వీడిన సెకండ్ క్యాడర్ బలంగా ఉంటే.. క్షేత్ర స్థాయిలో పార్టీకి ఏ ప్రాబ్లమ్ ఉండదని.. ఈ వ్యూహంలో భాగంగానే సెకండ్ కేడర్ ను ప్రోత్సహించాలని ఆయన ఆలోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉండటం కూడా ఈ ప్లాన్ కు మరింత కలిసి వస్తుందని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇందులో భాగంగానే రెండు రోజులు క్రితం 21 జిల్లాల జడ్పీ చైర్మన్లతో ఫామ్ హౌజ్ లో కేసీఆర్ భేటీ అయ్యారు. జెడ్పీ చైర్మన్లతో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా సమావేశానికి ఆహ్వానించారు. జడ్పీ చైర్మన్ లతో కలసి లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసిన కేసీఆర్.. పార్టీ మారొద్దంటూ ఈ సందర్భంగా వారిని బుజ్జగించి నట్లు టాక్. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వారి వెంట వెళ్లొద్దని.. మీరు పార్టీలోనే ఉండా లని కేసీఆర్ చెప్పినట్లు సమాచారం. భవిష్యత్ బీఆర్ఎస్ దేనని, పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్నవారికి భవిష్యత్ లో సముచిత స్థానం కల్పి స్తానని సైతం గులాబీ బాస్ హామీ ఇచ్చినట్లు ప్రచా రం జరుగుతోంది. సెకండ్ క్యాడర్ ను ప్రోత్సహి స్తున్న నేపథ్యంలో కేసీఆర్ తాజాగా జడ్పీ చైర్మన్ లతో జరిపిన సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. బీఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా సెకండ్ కేడర్ ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నారు. జగిత్యాలలో ఇటీ వల మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారి నా.. సెకండ్ క్యాడర్, కార్యకర్తలు పార్టీపై అచంచల విశ్వాసంతో ఉన్నారని, తమ పార్టీ బలం కూడా వాళ్లే నని పేర్కొన్నారు. పార్టీ మారే ఎమ్మెల్యేలను కట్ట డి చేయలేమని ఓ ప్రాథమిక అంచనాకు వచ్చిన తర్వాత గులాబీ పార్టీ సెకండ్ క్యాడర్ ను కాపా డుకో వాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. సెకండ్ క్యాడర్ బలంగా ఉంటే వచ్చే ఏ ఎన్నికల్లోనైనా ప్రత్యర్థి పార్టీలను ఢీకొట్టే సామర్థ్యం ఉంటుం దని భావిస్తు న్నట్టు చర్చ జరుగుతున్నది. ఎమ్మెల్యేలతో భేటీలు ముగిసిన వెంటనే కేసీఆర్ సెకండ్ క్యాడర్ తో భేటీ కా వడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తుం ది. ఎప్పుడు ఏ ఎమ్మెల్యే పార్టీ మారు తారో తెలియని పరిస్థితి నెలకొనడంతోనే సెకండ్ క్యాడర్ ను ఎంక రేజ్ చేయాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలు స్తోంది. ఎమ్మెల్యేల వలసల పర్వం కంటిన్యూ అవుతో న్న వేళ సెకండ్ క్యాడర్ ను ప్రోత్స హించాలనుకున్న కేసీఆర్ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

**ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ నుంచి**

ప్రతిరోజూ మాదిరి ఈరోజు గురువారం నాడు కూడా తమ ప్రియతమ నేత కేసీఆర్ ను కలిసేందుకు ఎర్రవెల్లి నివాసానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుంచి తనను కలిసేందుకు వచ్చిన ప్రజలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ గారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు.. ప్రతిపక్ష పాత్రకూడా శాశ్వతం కాదు. మనకు ప్రజా తీర్పే శిరోధార్యం. వారు ఎటువంటి పాత్రను అప్పగిస్తే దానిని చిత్తశుద్ధి తో నిర్వర్తించాలి. అధికారం కోల్పోయామని బాధపడడం సరియైన రాజకీయ నాయకుని లక్షణం కాదు. ప్రజా సంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం. దానికి గెలుపు ఓటములతో సంబంధం ఉండదు. ప్రజల్లో కలిసివుంటూ వారి సమస్యలమీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలని కేసీఆర్ పునరుద్ఘటించారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)
సహకరించాలని కోరినట్లు తెలిపారు. గోదావరి పరిసరాల్లోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, వేలం లేకుండా సింగరేణికి బొగ్గు గనులను కేటాయించాలని కోరామని ఆయన చెప్పారు.

## ఝార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్

**ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్**

**ఝార్ఖండ్ జూలై 4 :** ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్ ప్రమాణస్వీకారం చేశారు. గురువారం రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, హేమంత్ సోరెన్ తో ప్రమాణం చేయించారు. భూ కుంభకోణం కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది జనవరిలో హేమంత్ సోరెన్ ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టుకు ముందు ఆయన.. సీఎం పదవికి రాజీనామా చేశారు. దీంతో చంపయీ సోరెన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదల అయ్యారు. 5 నెలలుగా జైలులో ఉన్న హేమంత్ సోరెన్.. మళ్లీ ఝార్ఖండ్ సీఎంగా ప్రమాణం చేశారు.

## రేపు జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశం

**అధికార,విపక్షాల వ్యూహాలు, ప్రతి వ్యూహాలు**

**25 ప్రశ్నలకు మాత్రమే అనుమతి**

**హైదరాబాద్, జూలై 4, (ప్రజాస్వరం):** జీహెచ్ఎంసీ పాలకమండలి ఈ నెల 6న నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన అధికార, విపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లు వ్యూహం, ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ అయిన కాంగ్రెస్ కు కౌన్సిల్ లో కేవలం 12 మంది కార్పొరేటర్లే ఉన్నా, అధికార పార్టీని, అధికారులను పలు అంశాల్లో నిలదీసి ఇరకాటంలో పెట్టేందుకు విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కార్పొరేటర్లు వ్యూహం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇప్పటికే 148 ప్రశ్నలు కార్పొరేటర్ల నుంచి రాగా, కేవలం 25 ప్రశ్నలను మాత్రమే సభలో ప్రస్తావించేందుకు మేయర్ గద్వాల విజయలక్ష్మి ఎంపిక చేసినట్లు సమాచారం.ముఖ్యంగా విపక్షాలకు చెందిన కార్పొరేటర్లు వర్షం సహాయక చర్యలు, కుక్కలు, దోమల బెడద, సీజనల్ వ్యాధులు, జీహెచ్ఎంసీ అప్పులు, ఆర్థిక సంక్షోభంతో పాటు ట్యాక్స్ కలెక్షన్, టౌన్ ప్లానింగ్ వంటి అంశాలపై అధికారులను నిలదీసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, నిధుల కేటాయింపుపై నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పాతబస్తీలోని పలు సమస్యలతో పాటు కార్పొరేటర్ల బడ్జెట్ పై మజ్లిస్ ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. శానిటేషన్, నాలాల పూడికతీత, దోమల నివారణ వంటి అంశాలపై అధికారుల పనితీరును కౌన్సిల్ సమావేశంలో ఎకరవుపెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. దీనికి తోడు కొందరు బీజేపీ కార్పొరేటర్లు సర్కారు జీహెచ్ఎంసీకి చెల్లించాల్సిన ప్రొఫెషనల్ ట్యాక్స్, ప్రాపర్టీ ట్యాక్స్, మ్యుటేషన్, స్టాంప్స్, డ్యూటీ నిధుల కేటాయింపునకు సంబంధించిన ఇప్పటికే ప్రశ్నలు సమర్పించినట్లు తెలిసింది. తమ ప్రశ్నలు కౌన్సిల్లో ప్రస్తావించకుంటే నిరసన వ్యక్తం చేయాలని విపక్షాలకు చెందిన కొందరు కార్పొరేటర్లు భావిస్తున్నట్లు సమాచారం.ఇతర ప్రభుత్వ శాఖల నుంచి జీహెచ్ఎంసీలోకి డిప్యూటేషన్లపై వచ్చి, గడువు ముగిసినా, సీట్లు వదలని అధికారుల పనితీరుపై అధికార, విపక్షాలకు చెందిన పలువురు కార్పొరేటర్లు గుర్రుతో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఫోన్లు చేసినా, రెస్పాన్స్ కాని అధికారులపై కౌన్సిల్ లో నిలదీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ప్రజాప్రతినిధులు ఫోన్లు చేసినా, రెస్పాన్స్ కాని అధికారుల నుంచి జీహెచ్ఎంసీ ఫోన్లు వెనక్కి తీసుకోవాలని, దీంతో కనీసం జీహెచ్ఎంసీపై సెల్ ఫోన్ బిల్లుల భారమైన తగ్గుతుందని పలువురు కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేసే అవకాశం సైతం లేకపోలేదు. దీనికి తోడు గత కౌన్సిల్ సమావేశంలో అడ్వర్ టైజ్ మెంట్లు, శానిటేషన్ లలో జరిగిన పలు అక్రమాలపై విచారణ జరిపేందుకు కార్పొరేటర్లతో నియమించిన కమిటీ విచారణపై పలు విపక్షాలు ప్రశ్నించేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం.

# ప్రధానితో చంద్రబాబు భేటీ

**న్యూఢిల్లీ, జూలై4:** ఏపీ సీఎం చంద్రబాబు గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆయనకు వివరించారు. విభజన హామీల అమలుతో పాటు పోలవరం నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, ప్రాజెక్టుల మంజూరుపై చర్చించారు. అలాగే, కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు, పారిశ్రామిక రంగాలకు రాయితీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. దాదాపు అరగంట పాటు సాగిన సమావేశంలో చంద్రబాబు డిమాండ్లపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. అంతకు ముందు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తో భేటీ అయిన చంద్రబాబు.. వివిధ అంశాలపై మాట్లాడారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ నీరభ్ కుమార్, ప్రభుత్వ అధికారులు ఉన్నారు. సీఎం చంద్రబాబు ఈ నెల 5న శుక్రవారం నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, కేంద్ర మంత్రి అథవాలేతో భేటీ అవుతారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు జపాన్ రాయబారితో సీఎం భేటీ అవుతారు.

**తెలంగాణ సీఎం సైతం..**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం ఢిల్లీలో పర్యటిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర కేంద్ర మంత్రులను సైతం కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు సహా విభజన హామీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నారు. ఈ నెల 6న ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ సందర్భంగా విభజన హామీలు, పెండింగ్ అంశాలు చర్చించనున్న క్రమంలో ఈ అంశాన్ని కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. పీసీసీ చీఫ్ నియామకం సహా, మంత్రివర్గ విస్తరణపైనా ఇరువురు నేతలూ విస్తృతంగా కాంగ్రెస్ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

## కె కేశవరావు రాజీనామా

**న్యూ ఢిల్లీ జూలై 4 :** రాజ్యసభ సభ్యత్వా నికి కె కేశవరావు రాజీనామా చేశారు. గురువారం పార్లమెంట్ లో రాజ్యసభ చైర్మన్ ధన్ ఖడ్ ను కలిసి కేకే.. తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి బయ టకు వచ్చిన కేశవరావు.. నిన్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో పార్టీలో చేరారు.



రాజ్యసభ చైర్మన్ ధన్ఖడ్ను కలిసిన కేశవరావు

# సీఎంఆర్ఎఫ్ ఇక సులభతరం

## ఈనెల 15 తర్వాత ఆన్‌లైన్లోనే సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులు

- అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు
- నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో పథకం అమలు..
- దళారుల ప్రమేయానికి చెక్
- తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్..



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి సహాయ నిధిపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో పథకం అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా cmrf.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. మంగళవారం (జూలై 2వ తేదీ) సాయంత్రం.. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టాయని.. ఎన్నికల ముందు వేలాది చెక్కులు మిస్సయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన రేవంత్ సర్కార్ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసే విధానాన్ని తీసుకొచ్చింది. జూలై 15 తర్వాతి నుంచి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

### 15 నుంచి ఆన్ లైన్ లో మాత్రమే..

ఇక నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తులను సీఎంఆర్ఎఫ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈనెల 15 తర్వాత నుంచి ఆన్ లైన్ లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారు. సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫార్సు లేఖను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్‌లో దరఖాస్తుదారుల బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. వివరాలను వెబ్‌సైట్లోకి అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా మన అప్లికేషన్‌ను ట్రాక్ చేయొచ్చు. ఆన్‌లైన్లో వివరాలు సమర్పించిన తర్వాత ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన అప్లికేషన్‌ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి ఓ నిర్ధారణకు వస్తారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ఎఫ్ అప్లికేషన్‌ను ఆమోదించి చెక్కును సిద్ధం చేస్తారు. దరఖాస్తు సమయంలో ఇచ్చిన బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను చెక్ మీద ముద్రిస్తారు. దీని వల్ల చెక్ పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్‌లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు.





### సీఎం నిర్ణయం అభినందనీయం

పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి అందరికంటే ముందున్నాడు. సీఎం సహాయనిధి ఆశించే వారిలో పేద వారే ఎక్కువుంటారు. పేదలకు సీఎం ఆర్ఎఫ్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. అటువంటి పథకం ఆన్ లైన్ లోనే ధరఖాస్తు చేసే అవకాశం ఇవ్వడం అభినందనీయం. ఇంతకు ముందు వేరే పెద్ద పెద్ద లీడర్ల వద్దకు వెళ్లే అవసరం వుండేది. ఇప్పుడు అటువంటి ఇబ్బంది లేకుండానే ఆన్ లైన్ దరఖాస్తు ద్వారానే సీఎం సహాయ నిధి ఇవ్వడం అభినందనీయం.

- పెద్దింటి చంద్రయ్య, కాళ్లకల్



### సిఫారసు లేఖలతో పనిలేదు

ముఖ్యమంత్రి సహాయ నిధిపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం అభినందనీయం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలతోపాటు అవసరమైన పత్రాలు ఆన్ లైన్ లో జత చేయడం మంచి నిర్ణయం. సీఎం సహాయ నిధులు పక్కదారి పట్టకుండా ఎంతో ఉపయోగపడుతుంది. పేదలకు మరింత ఉపయోగపడుతుంది. దళారులకు చెక్ పడుతుంది. పేదల సంక్షేమానికి కృషిచేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- విద్యా సాగర్, సోషల్ వర్కర్



### శుభపరిణామం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం అభినందనీయం. ఆన్ లైన్ దరఖాస్తులతో CMRF నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో అర్హులకు అందుతాయి. ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించాలనే నిర్ణయం శుభపరిణామం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టాయని.. ఎన్నికల ముందు వేలాది చెక్కులు మిస్సయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన రేవంత్ సర్కార్ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసే విధానాన్ని తీసుకురావడం ఎంతో గొప్ప విషయం.

- బొల్లబోయిన ఐలేష్ యాదవ్, మెదక్ జిల్లా యాదవ సంఘం నాయకులు



# మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- రాష్ట్ర ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.
- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ

**మెదక్, జూలై 4 (ప్రజాస్వరం) :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు 2500 ఇస్తానని మోసం చేసిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు నెలకు రూ. 2500 అందించాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా శాఖ పిలుపు మేరకు గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బెండె వీణ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నికల సందర్బంగా కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి రోజుకో కొత్త కథ చెప్తూ కాలం వెళ్లదీస్తుందన్నారు. మహిళలకు ప్రతి నెల ఇస్తాం అన్న 2500 రూపాయలు ఇంతవరకు మొదలు కాలేదని, కొత్తగా పెళ్లి చేసుకునే వారికి ఒక లక్ష రూపాయలు, తులం బంగారం, డిగ్రీ చదివే విద్యార్థులకు స్కూటీ వంటి హామీలు ఎక్కడ ప్రస్తావించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, చేయని పక్షాన మహిళా మోర్చా ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి అయితారం సంగీత, రామాయంపేట మండల అధ్యక్షురాలు లావణ్య, దివ్య, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు విడుదల చేసినందుకు ధన్యవాదాలు

**మెదక్, జూలై 4 (ప్రజాస్వరం):** తెలంగాణ రాష్ట్రంలో 121 డిగ్రీ కళాశాల లో పనిచేస్తున్న 446 డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ 3 నెలల ఏప్రిల్ నుండి జూన్ వరకు వేతనాలు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి తెలంగాణ డిగ్రీ కాలేజ్ కాంటాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. కొత్త రెగ్యులర్ కమిషనర్ గా దేవసేన భాద్యతలు తీసుకున్న వెంటనే వేతనాలు విడుదల చెసినందుకు కమిషనర్ కి, సీసీఈ అధికారులకు తెలంగాణ డిగ్రీ కాలేజ్ కాంటాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు యం వినోద్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# నేడు చలో కలెక్టరేట్

- బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్

మెదక్, జూలై 4 (ప్రజాస్వరం) : తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల కు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసినందుకు గాను నిరసిస్తూ బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 5న చలో మెదక్ కలెక్టరేట్ చేపడుతున్నట్లు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని అన్నారు. గ్రూప్ - 2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టు లను పెంచాలని కోరారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలనీ, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్‌పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని అన్నారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46 ను వెంటనే రద్దు చేయా లని, జాబ్ క్యాలెండర్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# ఆదర్శప్రాయుడు కొమురయ్య

- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు
- మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు

**మెదక్, జూలై 4 (ప్రజాస్వరం):** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు కొము రయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి పోరాడిన మహనీయుడు కొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చే వ్యక్తి దొడ్డి కొమురయ్యనేనని పేర్కొన్నారు. దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడని, వరంగల్ జిల్లాలో సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య తెలంగాణ మహోన్నత ఉద్యమానికి ఆధ్యుడయ్యాడని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోశారని వారి ఆశయాలను నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.



# కొమురయ్య స్ఫూర్తితో పోరాటాలు నిర్వహిస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం

**మెదక్, జూలై 4 (ప్రజాస్వరం):** దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రం కేవల్ కిషన్ భవనంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారనీ దీన్నే తెలంగాణా సాయుధ పోరాటంగా పిలుస్తారని అన్నారు. వెట్టి చాకిరీ, దోపిడి విముక్తి వ్యతిరేకంగా కోసం పోరాటం చేసిన యోధుడు దొడ్డి కొమరయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే మల్లేశం, బి.బస్వరాజ్, నర్సమ్మ, నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# అటవీ సంపదను కాపాడుకోవాలి

- జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్

**వికారాబాద్, జూలై 4 (ప్రజాస్వరం) :** జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో అటవీ సంపదను కాపాడుకోవాలని జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సు లో మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లాలో ఈ సంవత్సరం 40 లక్షల 48 వేల టార్గెట్ ప్రకారం మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కావడానికి అవకాశం ఇవ్వకూడదని, ఎక్కడైనా అన్యాక్రాంతం అవుతున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే పోలీసు, రెవెన్యూ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త గా అన్యాక్రాంతం పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎఫ్ఆర్వోలు వారి పరిధిలో అటవీ భూముల సరిహద్దులను ఏర్పాటు చేయాలని, ఆటవీ భూముల పరిరక్షణలో అందరు కలిసి పని చేయాలని తెలిపారు. వనమహోత్సవం కింద నాటిన ప్రతి మొక్క బతకాలని, మొక్కలు నాటేందుకు సరైన స్థలాలను ఎంపిక చేయాలని, అన్ని ప్రభుత్వ సంస్థలు, రహదారులకు. ఇరువైపులా తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. ఏ కార్యాలయం, రహదారి మొక్కలు నాటకుండా వదలకూడదని, గుంతల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లా స్థాయి కార్యక్రమం తో పాటు, నియోజకవర్గాలలో మొక్కలు నాటేందుకు సంసిద్ధంగా ఉండాలని, సంబంధిత శాసనసభ్యులను మొక్కలు నాటే కార్యక్రమానికి ఆహ్వానించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్ పి రవీందర్ రెడ్డి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఆర్డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు

వన మహోత్సవంలో భాగంగా తాండూర్ నియోజకవర్గం యాలాల మండలం ముద్దయిపేట్ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు 300 ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బాల గంగాధర్, ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

- వికారాబాద్ (ప్రజాస్వరం)

